కష్టాల్లో కొత్త మండలాలు



ఈ ఫొటోలోని భవనం రామారెడ్డి ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల కోసం నిర్మించినది. ఈ భవనంలో 2017 నుంచి ఎంపీడీవో కార్యాలయం కొనసాగుతోంది. ఇటీవలే ఎంపీపీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగిసిపోవడంతో ఎంపీపీ చాంబర్‌ను తీసివేసి అదే ఛాంబర్‌లో కొత్త రామారెడ్డి ఎంఈవోకి కేటాయించారు. త్వరలోనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను నిర్వహిస్తామని చెబుతున్న ప్రభుత్వం.. కొత్త ఎంపీపీకి చాంబర్ ఎక్కడ కేటాయిస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పదవీ కాలం ముగిసిపోతే ఎంఈవో కార్యాలయం, మళ్లీ ఎంపీపీ, ఎంపీటీసీలు వస్తే ఎంఈవో ఆఫీస్‌ను తొలగిస్తారా? అని అడుగుతున్నారు.

- తాత్కాలిక భవనాల్లోనే కార్యాలయాల కొనసాగింపు
- తొమ్మిదేళ్లు గడిచినా స్థల సేకరణకు నోచుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, ప్రజలు

రామారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గంలోనే రామారెడ్డి జీపీ మేజర్ పంచాయతీ. ఈ జీపీ భవనంలో 2016 అక్టోబర్ 11న రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు కేటాయించి, ప్రభుత్వ ఆస్పత్రి చిన్న గదిని జీపీకి కేటాయించారు. అప్పటి నుంచి అలాగే కొనసాగుతున్నాయి. రామారెడ్డి పోలీస్‌స్టేషన్ పాత భవనం కావడంతో పెచ్చులూడుతున్నాయి. పెద్దకొడప్‌గల్ పోలీస్‌స్టేషన్ పశువైద్యశాలలో ఏర్పాటు చేశారు. పాల్వంచ మండలంలో రైతు వేదికలో తహసీల్ కార్యాలయం ఏర్పాటు వరకే ఆగిపోయింది. కొత్తగా ఏర్పడిన 9 మండలాల్లోని అన్ని కార్యాలయాలు తాత్కాలికంగా భవనాల్లోనే కొనసాగుతున్నాయి. రామారెడ్డి మండలంలోని ఏ ఒక్క భవనానికి ఇప్పటి వరకు కనీసం స్థల సేకరణ కూడా జరగలేదు. రామారెడ్డి తహసీల్ కార్యాలయంలో నీటి కొరత వేధిస్తోంది. పక్కనే నిర్మించిన సొసైటీ బ్యాంకు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. రామారెడ్డి తహసీల్ కార్యాలయాన్ని తాత్కాలింగా సొసైటీ భవనంలో ఏర్పాటు చేసి అలాగే నేటికి కొనసాగిస్తున్నారు.



సొసైటీ భవనంలో రామారెడ్డి తహసీల్ కార్యాలయం



రామారెడ్డి జీపీ భవనంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్

సిబ్బందికి ప్రజలకు అవస్థలు..

2016లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రామారెడ్డి తహసీల్ కార్యాలయంలో నీటి కొరత వేధిస్తుండగా, ఏవో ఆఫీస్ ఇరుకుగా ఉండటంతో మండల వ్యవసాయాధికారి రైతు వేదికలో విధులు నిర్వహిస్తున్నారు. రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో పెచ్చులూడి సిబ్బందికి ఇబ్బందిగా మారింది. మండల కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వస్తున్న ప్రజలకు సౌకర్యాలు లేక నానావస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కొత్త మండలాలకు భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

భవనాలు నిర్మించాలి



9 ఏళ్ల గడిచిన కొత్త మండలాల కార్యాయాల కోసం స్థల సేకరణ చేయక పోవడం దారుణం. ప్రభుత్వం స్పందించి వెంటనే కొత్త భవనాలు నిర్మించాలి.

– పడిగెల శ్రీనివాస్, రామారెడ్డి

ఇబ్బందులు పడుతున్నారు



ఇరుకు గదులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కొత్త భవనాలను నిర్మించాలి. సిబ్బందితో పాటు ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

– రాజేందర్, మాజీ ఎంపీటీసీ, మద్దికుంట

మాదకద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోరారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం వాల్ పోస్టర్‌లను బుధవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. కల్తీ కల్లు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. నేడు ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని చర్చి గ్రౌండ్ నుంచి కళాభారతి వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంత రావు, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

వెంటనే సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించాలి

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద, మద్నూర్, పిట్లంలో నిలిచిపోయిన సెంట్రల్ లైటింగ్ పనులు వెంటనే ప్రారంభించాలని కోరుతూ బుధవారం బీజేపీ నాయకులు బిచ్కుందలో రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే అరుణతార మాట్లాడుతూ.. ప్రభుత్వం సెంట్రల్ లైటింగ్ మంజూరు చేశామని చెప్పుకుంటున్నారు కాని కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. దీంతో వారు పనులు చేయకుండా మధ్యలోనే వెళ్లిపోయారని అన్నారు. పనులు తిరిగి ప్రారంభించకుంటే నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.



బిచ్కుందలో ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు

విద్యార్థుల సంఖ్య పెంచాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బడిబాట ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎంఈవో రామస్వామి సూచించారు. తాడ్వాయి విద్యా వనరుల కేంద్రంలో బుధవారం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతిరోజూ మధ్యాహ్న భోజన హాజరు తీసుకోవాలని, కొత్తగా పాఠశాలలో నమోదైన విద్యార్థుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పాఠశాలకు వచ్చిన యూనిఫాం దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, వర్క్‌బుక్‌ల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుచాలన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో రామస్వామి

పట్టణ బీజేపీ నూతన కమిటీ ఎన్నిక

కామారెడ్డి టౌన్: బీజేపీ పట్టణ నూతన కమిటీని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎన్నుకుని ప్రకటించారు. పట్టణ ఉపాధ్యక్షులుగా చిన్నోళ్ల రజినీకాంత్, చిన్నోజి శ్రీనివాస్, గుణేందర్, గంగాధర్, ప్రవీణ్, విజయ్ పాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా రఘు, రాజగోపాల్, కార్యదర్శులుగా భూమేష్ యాదవ్, ముల్కా శ్రీనివాస్, రంజిత్, గురుమూర్తి, రాజు, గోవర్ధన్, కోశాధికారిగా మల్లేష్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా ఉప్పు లక్ష్మీపతి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా రాజేందర్, గిరిజన మోర్చా అధ్యక్షుడిగా వినోద్, బీజేవైఎం అధ్యక్షుడిగా బాలే భరత్, మహిళా మోర్చా అధ్యక్షుడిగా బాలమణి, కిషన్ మోర్చా అధ్యక్షులుగా రాజు, మైనారిటీ మోర్చా అధ్యక్షులుగా లతీఫ్‌లను ఎన్నుకున్నారు.



నూతనంగా ఎన్నికైన పట్టణ కమిటీ సభ్యులు

కనీసం గుంతలైనా పూడ్చరూ..!



నస్రుల్లాబాద్(బాన్సువాడ): లింగంపల్లి–బొప్పాస్‌పల్లి గ్రామాల మధ్య గల రోడ్డుపై ఏర్పడిన గుంతలతో వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళ అదుపు తప్పి పడిపోయిన ఘటనలున్నాయి. సంబంధిత అధికారులు కనీసం గుంతలకు ప్యాచ్ వర్క్ చేసి సమస్య పరిష్కరించాలని స్థానిక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తెరవే ప్రత్యేక సంకలనం కోసం రచనల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల వేదిక(తెరవే) ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కవులతో ప్రత్యేక కవితా సంకలనం తీసుకువస్తున్నట్టు తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ తెలిపారు. జిల్లాకు చెందిన కవులు, రచయితలు తమ ఉత్తమమైన రచనలను వివరాలతో.. 98490 62038 నంబర్‌కు 25 లైన్లు మించకుండా వచ్చే నెల 5లోగా పంపించాలని సూచించారు. ఒక్కో కవి, రచయిత ఒక్కటి మాత్రమే పంపాలని, ఎక్కువ పంపితే తొలిగిస్తామని ఆయన పేర్కొన్నారు.

బెల్టు షాపులను కట్టడి చేయండి



బాన్సువాడ రూరల్: కోనాపూర్‌లో బెల్ట్ షాపులను కట్టడి చేయాలని కోరుతూ బుధవారం గ్రామస్తులు తీర్మానం చేశారు. తీర్మాన ప్రతులను పంచాయతీ కార్యదర్శితో పాటు ఎక్సైజ్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. గ్రామంలో యువత మద్యానికి బానిసలై పనీపాట లేకుండా కుటుంబాలకు భారమవుతున్నారని వాపోయారు. గ్రామంలో బెల్ట్‌షాపు వేలంపాట నిర్వహించాలని ప్రయత్నిస్తే అడ్డుకుంటామన్నారు.

నేటి చిత్రం

నీళ్లు ఎక్కడ పట్టుకునేది?



మాచారెడ్డి: ఘన్‌పూర్(ఎం)లో ఉన్న మినీ వాటర్ ట్యాంక్ చుట్టూ పిచ్చిమొక్కలు, గడ్డి పెరుగడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. నీటి కోసం ట్యాంక్ వద్దకు వెళ్లినప్పుడు క్రిమికీటకాలు, పాములు కనిపిస్తున్నాయి. అలాగే నీటి పట్టుకోవడానికి వీలులేకుండా గడ్డి పెరిగింది. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలను తొలగించాలి.

– సాదేమ్ సతీష్, ఘన్‌పూర్(ఎం)

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200
ఎల్లారెడ్డి : 97053 46576
బాన్సువాడ : 94402 11363
జుక్కల్ : 97053 46578

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

మద్నూర్(జుక్కల్): రైతులకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దరాస్‌వార్ సాయిలు అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం రైతు భరోసా సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతును రాజు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. రైతులకు రైతుభరోసా, రూ. 2 లక్షల వరకు రుణమాఫీ, రైతు బీమా, సన్నాలకు బోనస్ ఇచ్చి అన్నదాతలకు అండగా నిలుస్తోందన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. విండో చైర్మన్ శీను పటేల్, మాజీ ఎంపీపీ ప్రజ్ఞకుమార్, నాయకులు హన్మండ్లు, గంగాధర్, దత్తు, గోపి, రవి, లక్ష్మణ్, రాజు తదితరులున్నారు.



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి



బీబీపేట: గ్రామాల్లో అభివృద్ధి కోసం సర్పంచులు ఖర్చు చేసిన బిల్లులు వెంటనే విడుదల చేయాలని మండల మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కోసం తాము సొంత డబ్బులను ఖర్చు చేశామని తీరా ప్రభుత్వాలు మారాక బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని పేర్కొన్నారు. మాజీ సర్పంచులు రాంరెడ్డి, ప్రసాద్, శ్రీనివాస్, తదితరులున్నారు.

కూలే వరకు స్పందించరా?



మద్నూర్(జుక్కల్): మండలంలో ప్రసిద్ధి చెందిన సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయ పాత స్వాగత తోరణం శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా మారింది. ఇటీవల కురిసిన వర్షంతో స్వాగత తోరణం ఒక వైపు పూర్తిగా కూలిపోయింది. ఈ ఆలయానికి నిత్యం వందలాది మంది భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. ప్రమాదవశాత్తు జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలని భక్తులు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ఎల్లారెడ్డిరూరల్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో ప్రకాష్ అన్నారు. బుధవారం అల్మాజీపూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని, దశల వారీగా డబ్బులు ఖాతాలలో జమవుతాయన్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీవో మలహరి సూచించారు. బుధవారం ఆయన కొర్పోల్‌లో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం పారిశుధ్య పనులు పరిశీలించి జీపీ రికార్డులు తనిఖీ చేశారు.



అల్మాజీపూర్‌లో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రకాష్

వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో నరేశ్



దోమకొండలో ప్రభుత్వ బాలికల పాఠశాలలో మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం శరత్‌కుమార్

లింగంపేట(ఎల్లారెడ్డి): వనమహోత్సవం కార్యక్రమానికి స్థలాలు ఎంపిక చేసుకొని మొక్కలు నాటడానికి నర్సరీల్లోని మొక్కలు సిద్ధం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి నరేశ్ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, గ్రామాల్లో పారిశుధ్యం, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలపై వివరించారు. ఉపాధి హామీ పనుల నిర్వహణపై డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఎంపీవో మలహరి, ఏపీవో నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వన మహోత్సవం

దోమకొండ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం వన మహోత్సవం నిర్వహించారు. ఆయా పాఠశాల ఆవరణల్లో మొక్కలు నాటారు. మండల విద్యాధికారి విజయ్‌కుమార్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శరత్‌కుమార్, రాధాలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్లు అందించాలి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫస్టియర్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని అలాట్‌మెంట్ వచ్చిన వారు సర్టిఫికెట్లు అందించాలని కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ సూచించారు. దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో ఎల్లారెడ్డి కళాశాలకు ఎంపికైన విద్యార్థులు ఈనెల 30లోగా వారి సర్టిఫికెట్లు సమర్పించాలని అన్నారు. సర్టిఫికెట్లు అందించిన వారికి మాత్రమే సీట్లు కేటాయిస్తామన్నారు.

అసత్య ఆరోపణలు సరికాదు

ఎల్లారెడ్డి: బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సతీష్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే ఎల్లారెడ్డి బస్టాండ్, వంద పడకల ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు నిధులు మంజూరై పనులు ప్రారంభించారని గుర్తు చేశారు. నాయకులు సురేందర్, సాయిలు, ఇమ్రాన్, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు జలంధర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ నర్సింలు తదితరులున్నారు.

నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఎన్‌జీవోస్ కాలనీలోని లలితత్రిపుర సుందరీదేవి ఆలయంలో ఈనెల 26 నుంచి జూలై 4 వరకు వారాహిదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు వేదపండితులు గంగవరం అంజనేయశర్మ తెలిపారు. కాశీకి సర్వసైన్యాధిపతిగా వారాహిదేవిని భావిస్తారని, అలాంటి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో నిర్వహించడం తొలిసారని అన్నారు.

బదిలీ చేశాకే ప్రమోషన్లు ఇవ్వాలి

గాంధారి(ఎల్లారెడ్డి): గెజిటెడ్ హెచ్‌ఎంల బదిలీలు పూర్తి చేశాకే స్కూల్ అసిస్టెంట్‌లకు ప్రమోషన్లు ఇవ్వాలని మండల పరిధిలోని గెజిటెట్ హెచ్‌ఎంలు ప్రభుత్వాన్ని కోరారు. గౌరారం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఇన్‌చార్జ్ ఎంఈవో శ్రీహరితో పాటు గండివేట్, పొతంగల్ కలాన్, పేట్‌సంగెం హెచ్‌ఎంలు శ్రీనివాస్, రంగారావు, కుమార స్వామి కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తాము 2023లో పదోన్నతుల్లో భాగంగా మల్టీ జోన్‌కు వచ్చామని, తాము ఇతర జిల్లాల నుంచి వచ్చి సుమారు 200 కిలోమీటర్ల దూరంలో పనిచేస్తున్నామని వాపోయారు.

తలసేమియా పురస్కారం



కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ఇప్పటి వరకు 33 ప్రత్యేక రక్తదాన శిబిరాల ద్వారా 3,500 యూనిట్ల రక్తం సేకరించినందుకు ఐవీఎఫ్ రాష్ట్ర సేవాదళ్ చైర్మన్ బాలుకు ఐవీఎఫ్ రామంతాపూర్ శాఖ 12 వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో తలసేమియా పురస్కారం అందజేసింది. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు కట్ట రవికుమార్, ప్రధాన కార్యదర్శి పబ్బ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత దేశంగా మార్చాలి



రామారెడ్డి: టీబీ రహిత దేశంగా భారతదేశాన్ని మార్చాలని వైద్యాధికారి సురేష్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా రామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత టీబీ, తెమడ పరీక్షలు, ఛాతీ ఎక్స్‌రేలు, రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరం ఉన్నవారికి మందులను అందజేశారు. దగ్గు ఎక్కువ రోజులుగా ఉన్నట్లయితే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు డ్రెస్‌లు, బూట్ల పంపిణీ



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని పాతరాజంపేట ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఒక జత స్కూల్ డ్రెస్, స్పోర్ట్స్ డ్రెస్, బూట్లను ఎంఈవో ఎల్లయ్య అందజేశారు. పాఠశాల హెడ్‌మాస్టర్ అశోక్ విరాళంగా వీటి అందజేశారు. అశోక్‌ను ఎంఈవో అభినందించారు. సీఆర్‌పీ చిరంజీవి, ఉపాధ్యాయులు స్వామి, వినోద, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మాచారెడ్డి: సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాచారెడ్డి హెడ్ కానిస్టేబుల్ వీరన్న సూచించారు. బుధవారం పాల్వంచ మండల కేంద్రంలో గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి ఓటీపీలు చెప్పొద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సుభాష్ రెడ్డి, రమేష్ ఉన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

కామారెడ్డి అర్బన్: స్థానిక అయ్యప్ప ఆలయంలో బుధవారం దివంగత మాజీ మున్సిపల్ చైర్మన్, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు చీల ప్రభాకర్ జ్ఞాపకార్థం పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నస్కంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్, ప్రతినిధులు రమేష్, లక్ష్మణ్, నీలరాజు, ఓంప్రకాష్, కిరణ్, పబ్బ వేణు, గరిపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామ దేవతలకు జలాభిషేకం

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో గురువారం గ్రామ దేవతలకు జలాభిషేకం చేస్తున్నామని, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని మున్నూర్ కాపు సంఘం నాయకుడు, రైతు గద్దం అరవింద్, మాజీ ఏఎంసీ చైర్మన్ నాల్చర్ రాజు, దర్పల్ గంగాధర్ కోరారు. వర్షం కోసం జలాభిషేకం చేస్తున్నాం.. అందరూ పాల్గొని మొక్కులు తీర్చుకోవాలని ఆకాంక్షించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పూజా కార్యక్రమాలుంటాయన్నారు.అనంతరం హనుమాన్ ఆలయంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

వన్‌టైం సెటిల్మెంట్‌కు ఆఖరి అవకాశం

మద్నూర్(జుక్కల్): మద్నూర్, డోంగ్లీ మండలాలకు చెందిన వారు ఎన్‌డీసీసీ, మద్నూర్ సహకార సంఘంలో బకాయలు ఉన్న వారికి వన్‌టైం సెటిల్మెంట్ కోసం ఈ నెల 30లోపు ఆఖరి అవకాశం ఉన్నట్లు ఎన్‌డీసీసీ బ్యాంక్ మేనేజర్ సాయిలు, సొసైటీ కార్యదర్శి బాబూరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎన్‌డీసీసీ బ్యాంక్‌లో బుధవారం వారు మాట్లాడుతూ.. మద్నూర్ సొసైటీలో 90 మంది, ఎన్‌డీసీసీ బ్యాంక్‌లో 35 మంది బకాయిదారులు ఉన్నారని చెప్పారు.

బీఎస్పీ కార్యవర్గం ఏర్పాటు

మాచారెడ్డి: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) మండల కార్యవర్గాన్ని బుధవారం జిల్లా అధ్యక్షుడు హరిలాల్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొడ్డు సంతోష్, ఉపాధ్యక్షుడిగా ఇల్లెందుల మనోహర్, ప్రధాన కార్యదర్శిగా మాలోత్ శివాజీ నాయక్, కార్యదర్శిగా మారుపాక ప్రభాకర్, కోశాధికారిగా మురళి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్ మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని చోట్ల పోటీ చేస్తామన్నారు. నాయకులు మల్లేష్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

కామారెడ్డి టౌన్: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బానోత్ రఘురాం నాయక్ ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా స్కూళ్లు ప్రారంభమై 15 రోజులవుతున్నా ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు పూర్తి స్థాయిలో పుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేయలేదన్నారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.జిల్లా కన్వీనర్ శివప్రసాద్, సంపత్, సనత్, కుషాల్, రమేష్, శ్రీను పాల్గొన్నారు.